ధర్మ వడ్డీ

నేనా ఊరు ఎందుకు వెళ్ళానో, నా కిప్పుడు జ్ఞాపకంలేదు. కాని, వెళ్ళటం చిన్నప్పటి స్నేహితుడు కనవట్టం, తన యింటికి నన్ను తీసుకువెళ్ళటం జరిగింది. కలవక కలుసుకోవటంవల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకొని నవ్వుకొంటూ వున్న సమయంలో అత డొచ్చాడు. రావటం రావటం యెలా వచ్చాడని?

ముందువాకిలి నెమ్మదిగా తెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగ చూపులు చూశాడు. చంకలో వున్న మూటని పదిలంగా రెండో చేత్తో పట్టుకొని, తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసు కుంటూ, నా స్నేహితుని దగ్గరకు వొచ్చి చంకలో మూట అందిస్తూ, "ఇది గోనయ్, డబ్బూ" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితునికి ముఖ కవళికలు మారిపోయినై. అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూట అందుకుంటూ "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా! నికార్సయిన మనిషివి" అన్నాడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనవడనివ్వకుండా, "మాటలకేంలే! డబ్బు తీసుకోగానే కాదు. నెల రోజులలో అసలుపాయి దాలు యిచ్చి వెయ్యాలి. వడ్డీ నీకు తెలిసిందేగా—ధర్మవడ్డీ— నెలకు నూటికి రూపాయిన్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను" అన్నాడు.

"అలాగే సూరయ్యా, నెలదాటకముందే యిస్తాను" అన్నాడు నా స్నేహితుడు.

"ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభ కార్యం ఒకటి తలపెట్టావా? మంచికీ చెడుకీ డబ్బు కావాల్సి వొస్తుంది. తర్వాత కోర్టు గీర్టూ అంటే....

"అదేమిటి సూరయ్యా! నీ దగ్గర యెన్నిసార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్నిసార్లు యివ్వలేదు. ఎప్పుడైనా మాట తప్పీలు వొచ్చిందా?"

"సరేలే, డబ్బు లెక్కపెట్టుకో, అన్నీ రూపాయలే. కొద్దిగా మాత్రం చిల్లరవుంది. మళ్ళీ నాకు రూపాయలే యివ్వాలిసుమా! నోట్లూ గీటూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడూ మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగి పోయింది అయోమయం అయిపోయింది. ఆ మూటలోవున్నవన్నీ రాళ్ళే చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ — పెద్దవన్నీ శంకరరాళ్ళూ చిన్నవన్నీ గులకరాళ్లూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతడూ మాత్రం ఇదంతా లెక్కచెయ్యకుండా, అతి జాగ్రత్తగా ఆ రాళ్ళని తీసి ఒక్కొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్యవంక చూశాను. అతనింకా తల ఓరగానే పెట్టి లెక్కపెట్టబడుతూవున్న రాళ్ళను రెప్పవెయ్యకుండా పరీక్షిస్తున్నాడూ. ఇంతలో నా స్నేహితుడు లెక్క పూర్తిచేసి, "సరిపోయినయి, సూరయ్యా" అన్నాడు.

"ఇవ్వాళ సరిపోయినై అంటే కాదోయ్. ఇవ్వాళ యిరవై, మళ్ళీ యిరనె సోమవారంనాటికి నా డబ్బంతా దమ్మిడీలో యిచ్చెయ్యాలి" అని జ్ఞాపకంచేసి నా స్నేహితుడితో మూడుసార్లు 'ఇస్తాను' అనిపించుకొని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతను ఎప్పుడు వెళ్తాడా, ఈ తంతేమిటో యెప్పుడు తెలుసుకుందాందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితునివైపుకి తిరిగే

టప్పటికి, అతడు చేత్తో నన్ను వారించి వాకిలివైపుకి చూశాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపు నెట్టుకొని లోపలకు రావటం ఒకే సారి జరిగింది. మనిషి యిదివరకుమల్లే లేడు. ఆపాదమస్తకం వొణికి పోతున్నాడు. కళ్ళు యెర్రగా జ్యోతుల్లావున్నై. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఒరగానే వుంది.

ఒక్క క్షణం వాకిటిలో ఆగి రయిన నా స్నేహితుడి మీదకువచ్చి యిలా కేకలువేశాను "ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళయింది? యిదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ యింటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా వుండక్కర్లా? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డితింటున్నావా?"

నిజం చెప్పొద్దూ! యీ మాటలు వినేటప్పటికి నాకు కంపరం యెత్తింది, కోపం వచ్చింది. కాని యేమి చెయ్యటం? గుడ్లు వప్పచెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతి వినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు! నాలుగు రోజులు ఆలస్యమైనంత మాత్రాన నీ బోటి పెద్ద మనిషి యిట్లా నోరుపారేసుకోవటం ఏం మర్యాద!" అని తన దగ్గరేవున్న ఆ రాళ్ళమూటని యిచ్చాడు.

"మరి పడ్డీయో? డబ్బు నాకు చేదై యిచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చొండి యిచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం చేసి కదులు" అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా. మరి వొదులు" అన్నాడు నా స్నేహితుడు.

"తీసుకురా" అని ఒక్కతోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకొని గోడపక్కకు వెళ్ళి, పదిరాళ్ళు యేరితెచ్చి సూరయ్య చేతులో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకొని, నా స్నేహితునితో ఒక్క మాటైనా అనకుండా గిరుక్కున వాలికివైపుకు తిరిగి తల ఒరగానే వుంచుకొని గబగబా నడిచి వెళ్ళి పోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తానే యిలా చెప్పాడు—"పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ ఊళ్ళోకల్లా షావుకారు ఈ సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి ఈ విధంగా తయారయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా! ఎందుకెత్తింది! పిచ్చిలో ఇదేమిటి?" అని అడిగాను.

నా స్నేహితుడు సూరయ్యకథ యీ విధంగా చెప్పాడు :

"సూరయ్య యీ గతికి రావటానికి అతని తండ్రే కారణం అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి అతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు...."

"చెప్తాను విను. అంతమంచివాడు అవటంవల్ల దానాలు చేసీ, అడ్డాలు వుండీ తన ఆస్తంతా పాడుచేశాడు ఆస్తిపోయిన తర్వాత పలకరించే దిక్కులేకుండా చచ్చిపోయాడు ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘంమీద కసి యేర్పట్టంలో ఆశ్చర్యంలేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకొని, పెత్తనానికి వొచ్చినప్పటినుంచీ కఠోరంగా సంపాదించటం మొదలుపెట్టాడు. వున్న నాలుగు ఎకరాలూ అమ్మేసీ వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. మనుషుల్తోవున్న యితరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ మిగిలిన మనుషులకీ ఒక్కటే సంబంధం వడ్డీ వ్యాపారం. తాను వడ్డీకి డబ్బు యివ్వటానికి పుట్టాడు, మిగిలిన జనం డబ్బు పుచ్చుకొని వడ్డీ యిచ్చుకోటానికి పుట్టింది.

"ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి, కొద్ది సంవత్సరాలలోనే ఊళ్ళోకల్లా షావుకారై కూర్చున్నాడు. ఎంత షావుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైన పద్ధతులు యెలా మారతై—కనుక డబ్బు అవసరం లేనప్పటికీకూడా పాత పద్ధతులమీదే నడిచాడు. పిల్లికి

బిచ్చం పెట్టేవాడుకాదు. అడిలి గీ పెట్టినా దమ్మిడీ జారనిచ్చేవాడుకాదు. బాకీదార్లని ఎన్ని కష్టాలుపెట్టాలో అన్నీ పెట్టి ఇన్ని నీళ్ళుకూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు ఆ పిండుకోవటంలోకూడా దయాదాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేదికాదు.

"అందుకని అతని డబ్బుతోపాటు, అతనిమీద ఊళ్ళో అసూయా, అసహ్యంకూడా పెరుగుతూవచ్చినై. అతన్ని చూస్తే భయమే తప్ప యిష్టం ఒక్క వ్యక్తికొక్కడా లేకుండా పోయింది. సూరయ్య యిదికూడా మంచిదే అనుకున్నాడు. నాక్కావలసింది డబ్బు, వీళ్ళ యిష్టం ఎవరిక్కావాలి? అంటూ వుండేవాడు. పరిస్థితులు యిట్లావుండగా ఒక సంఘటన జరిగింది.

ఈ వూళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు వున్నాడు. చంద్రయ్య ఈ సూరయ్యకి రెండువందల రూపాయల బాకీ ఇవ్వాలేలాడు. చంద్రయ్య అవటం చిన్నరైతే ఐనా బాన్తో సంబంధంవున్న వాడవటం వల్ల, డబ్బన్నా, కోర్టన్నా లెక్కలేకుండా వుండేవాడు. డబ్బున్నవాళ్ళంటే అసహ్యం వుంది. భయంలేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్య అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం,కోపం కలిగినవాడు.సూరయ్య హెచ్చువడ్డీ వస్తుందని అతనికి అప్పు పెట్టాడేగాని, పెట్టిందగ్గర్నుంచీ డబ్బు రాదేమో అనే భయంతో అతని యింటిచుట్టూ తిరగటం మొదలుపెట్టాడు.ఒకరోజు చంద్రయ్యని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు; దాన్తో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యలోనుంచి గుప్పున బయటపడింది- 'నేను దమ్మిడీ యివ్వను. నీ తాత్తో చెప్పుకో! ముందు గడపదాటండి అవతలకు వెళ్ళు' అని కే లు వేశాడు.

"పాపం సూరయ్యకు యిట్లాంటి అనుభవం యిదివరకెప్పుడూ కలగలేదేమో,చంద్రయ్య మాటలకు నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడలేకపోయాడు.

'వెళ్ళవ్!' అని గద్దించాడు చంద్రయ్య. 'చంద్రయ్యా! ఇది నీకు మంచిది కాదు; కోర్టుకులాగి వప్పు తీయిస్తాను' అన్నాడు సూరయ్య.

'వప్పు తీయిస్తావట్రా మాదచ్చోద్' అని నానా బూతులూ కూని మెడమీద కఱ్ఱవేసి బయటకు గెంటాడు చంద్రయ్య.

"ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు శివం ఎత్తింది. పిచ్చిగంగిర్లెత్తినై. కనపడ్డవాడికల్లా చెప్పాడు. 'ధర్మవడ్డీ ధర్మ వడ్డీకూడా యివ్వడట! అసలే యివ్వడట! ఇదెక్కడన్నా వుందా? రాములవారి కాలం నుంచీ యీ వడ్డీ వుందిగదా!' అని మొత్తుకున్నాడు.

"తిరిగి తిరిగి ఇంటికివెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోటిలో వేసుకొని, అంగోస్త్రం నడుంకి కట్టి తెల్లగుడ్డ గొడుగు చంకనపెట్టి టౌన్‌కి బయలుదేరాడు అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలిముందు సకిలిస్తూ నాలుగైదుసార్లు అటూ యిటూ పచార్లుచేశాడు. బజార్నపోతున్నవార్ని నిర్నిమిత్తంగా పిలిచి, 'కొంచెం కోర్టులో పనివుండి టౌన్‌కి వెళ్తున్నాను' అని యింటి[illegible] చంద్రయ్యకు వినబడేటట్టు చెప్పాడు. 'కోర్టుకాదు, నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళు. ఈ ఊరు [illegible] నీకు ప్రాప్తంలేదు" అని యింటిలోనుంచే కేకవేశాడు.

"ఇంకేం చేస్తాడు? ఇక తప్పేదేముంది? చంద్రయ్య మాటలకు మనస్సులో కొంచెం జంకినా డబ్బెలా వొదులుకోవటం? మనస్సుని తిట్టి లొంగదీసుకొని టౌన్‌కివెళ్ళి ప్లీడరుతో మాట్లాడి చంద్రయ్యకు రిజిష్టర్ నోటీసు యిప్పించాడు. నోటీసైతే యిప్పించాడేగాని మనస్సులో ఆరాటం హెచ్చింది దిగులు దిగులుగా వుండి ఏమీ తోచక టౌన్‌లో అటూ యిటూ [illegible] యింటికి బయలుదేరేటప్పటికి [illegible] టౌన్ నుంచి మా ఊరు రావాలంటే రోడ్డు దిగి డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. సూరయ్య డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటిపడ్డది. రోడ్డు దిగేటప్పటికి అతనికి భయం వేసింది. ఆ డొంక మా ఒక్క వూరికి వచ్చేదే అవటంవల్ల మనుష్యసంచారం తక్కువగా వుంటుంది. పైగా రెండు

పక్కలా కొరివిదయ్యాలు తలలు విరబోసుకున్నట్లు కనబడే, గుబురుగా పెరిగినచెట్టు. సూరయ్య ధైర్యంచేసి ఆంజనేయ దండకం పఠిస్తూ డొంకలో పదిగజాలు నడిచాడు. ఆ పెద్దమర్రిచెట్టు చూశావుగా, అక్కడకువొచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతనికోసం పొదలలో కనిపెట్టుక్కూచున్న, చంద్రయ్యముఠా పదిమంది అతన్ని కమ్ముకున్నారు. ముందుకు దూకారు. చావచితక గొట్టారు. పాపం కిందపడేసి నున్నంమీద ఎముక లేకుండా కొట్టారు. చంద్రయ్య మీదపడి అతని జేబులోవున్న యిరవై రూపాయలూ లాక్కుని, "బావా బాఖత్సేశావుగా? కర్చెవ్వరు పెట్టుకుంటారు నీ తాత!" అనికాలికి వొచ్చినట్టు తన్ని, మిగిలిన వాళ్ళని తీసుకొని, సూరయ్యని అక్కడే వొదలి వెళ్ళిపోయారు.

"క్షణాలమీద యీ వార్త వూరంతా పొక్కింది. 'సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా'రని ఊరంతా ఆ గుబ్బుగా చెప్పుకుంది. కాని ఒక్కడుకూడా జాలి తలిచిన వాడేలేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేడు.

"సూరయ్య భార్య దొడ్డ యిల్లాలు. కూతురుకూడా చాలా మంచిది, కాని బయటజరిగే దురంతాలను వాళ్ళెలా ఆపగలరు? సూరయ్యని మనస్సుని ఎలా తిప్పగలరు?

"తెల్లగా తెల్లవారింతర్వాత ఊళ్ళో షావుకార్లు సూరయ్యని పరామర్శించటానికివొచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్రలేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురు నోటికి మాటలేకుండా యేడుస్తున్నా, వాళ్ళవంకకే చూట్టంలేదు. అన్ని దెబ్బలుతిన్నా ఒక్క మూలుగన్నా మూలగటంలేదు.

"షావుకార్లువొచ్చి, 'సూరయ్యా! ఇక చూస్తూ ఊరుకుంటే లాభం లేదు. క్రిమినల్ కేసు బనాయించి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే!' అన్నారు.

"సూరయ్య కొంచెం కదిలి, వాళ్ళని వింపాదిగాచూచి, "ఇంకేం? అందరం చందాలు వేసుకొని వ్యాజ్యమాడదాం" అన్నాడు.

"'చందాలు' అనేటప్పటికి షావుకార్లు మొహా మొహాలు చూచుకున్నారు. "అదేమిటి సూరయ్యా నిన్ను కొట్టటమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నాడు.

"ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చొని, "వాళ్ళు నన్ను కొట్టారా? నా దగ్గరవున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ ఊళ్ళోవున్న షావుకార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడ్నీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు, మిగిలిన వాళ్ళంతా ఎందుకు కుమ్మక్కుచేస్తారు? వాళ్ళు కొట్టగలరు గనక అంతాకలిసి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతాకలసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

"షావుకార్లకు యిదేమీ అర్థంకాలేదు. దెబ్బలతో సూరయ్యా మతి చెడ్డది అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

"ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు కేసు పెట్టనంటే పెట్టనన్నాడు "నా సొంత డబ్బు తగలేసుకొని, ఈ డబ్బున్న వాళ్ళకోసం వ్యాజ్యం అడిపెట్టనా? నే చెయ్యను" అనేవాడు.

కాని చంద్రయ్య యే ముహూర్తాన చెయ్యి చేసుకున్నాడోగాని, అప్పటినుంచీ సూరయ్యా దశ తిరిగిపోయింది. దెబ్బలుతిని కేసు పెట్టక పోయేటప్పటికి వూళ్ళోవాళ్ళకి లొల్లి అయిపోయాడు తాము ఏ డబ్బుని చూచి భయపడుతున్నారో ఆ డబ్బు సమయానికి సూరయ్యను ఆదుకోలేక పోయేటప్పటికి యింకేముంది? పెద్దలు మొదలు కుర్రవాళ్ళవరకూ సూరయ్యాని ఆటలు పట్టించటం మొదలుపెట్టారు. ఇల్లు కదిలితేచాలు "సూరయ్యా వడ్డీ చంద్రయ్యా లాఠీ" అని పిల్లలు చప్పట్లుకొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు

కావాలా?'' అనేవారు. కొందరు "ఇదిగో అసలు-ఇదిగో వడ్డీ'' అనిమొట్టి కాయలు వేసేవారుకూడాను.

చివరకు సూరయ్యకు చిల్లిగవ్వకూడా వసూలుకాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగేపోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే యింకిపోయింది. తనకు తదనంతమయినా వస్తుందనుకున్న ఆస్తిరాకుండా పోయిందని అల్లుడు కూతురుని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్యమొహం, కూతురుమొహం చూడలేక వీలైనంత వరకు ఇంట్లో వుండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. నాలుగు మెతుకులు నోటిలో వేసుకొచ్చి చెరువుగట్టుమీద రావిచెట్టుకింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు ఏరుకొని ఒక్కొక్కటీ చెర్లోవేస్తూ, అవి నీళ్ళలో పుట్టించే కదలికను పరీక్షిస్తూ కూర్చునేవాడు.

కాని వూళ్ళో జనం అక్కడ అతన్ని సుఖంగా వుండనివ్వలేదు. అతడు నిస్పృహాయుడౌతున్నకొద్దీ జనం తనబలాన్ని ఎక్కువగా ఉపయోగించటం మొదలుపెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, అలుసూ అతనితోనే ఆగక అతని కుటుంబంమీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్యకూతురు వాములదొడ్లో గేదెకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకొని గాతంలో పడేసి బలాత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళితర్వాత ఆపిల్లలేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్య భార్య అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకొని కాల్చుకొని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తమ పేర ట్రాన్స్ఫర్ చేయించుకొని ఇల్లు వేలం వేయించారు....''

ఇంతవరకు ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను—"ఈ ఘోరకృత్యాన్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?''

“ఎవరన్నవాళ్ళేలేరు. చేసుకున్నది. అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డు చెపితే తమ కుటుంబాలు సరిగ్గావుండవేమో అనే భయంతో కొందరూ మొత్తానికి అంతా మెదలకుండా వూరుకున్నారు.”

“ఊఁ! తరువాత ఏం జరిగింది?” అని అడిగాను.

“ఇంకేముంది! డబ్బుదారిన డబ్బు నడిచింది. కూతురు అలా అయిపోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినై. అపులాగా అడుగుతూ, వూరుపట్టుకు తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పుడెవరన్నా జాలితలచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువు గట్టుమీద రావిచెట్టుకిందే వుంటాడు. ఎండలో, వానలో అక్కడే వుంటాడు. ఎప్పుడూ కూతురు సంగతిగానీ, భార్య సంగతిగానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజు కొక్కసారి వెళ్ళి తనపాత ఇంటిని దూరాన్నుంచి చూచుకొని కన్నీరు పెట్టుకుంటూ ఉంటాడనీ, రాత్రికి తనకూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకు వెళ్ళి ప్రదక్షిణంచేసి వస్తూ వుంటాడని వూళ్ళో చెప్పుకుంటూ వుంటారు....ఇదీ సమాచారం....”

నేను కథంతా ప్రాణాలు బిగపట్టుకొని విన్నాను. సూరయ్య కథ చెప్తున్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు. గనక చాలా బాధపడ్డాను “మరి ఈ రాళ్ళ వ్యవహారమేమిటి?” అని అడిగాను.

“అలవాటు” అన్నాడు నా స్నేహితుడు “పాత అలవాటున పట్టి ఇలా చేస్తూవుంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టడం ఎందుకని తగు విధంగా ప్రవర్తిస్తూ వుంటాం. ఈ సూరయ్య....”

నా స్నేహితుడు చెబుతూవుండగానే వీధిలో పెద్ద గోల బయల్దేరింది—“సూరయ్య వడ్డీ. చంద్రయ్య లాఠీ,” అని కేకలు బయటనుంచే సూరయ్య “ఛే” అని అరిచాడు. ఆ ధ్వనివిని మేమిద్దరం బయటకు పరుగెత్తాం.

బయట వీధిలో సూరయ్య రొజుకుంటూ, రొప్పుకుంటూ గబగబా నడుస్తూ వెళ్తున్నాడు. చేతిలో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా వుంది.

వెనక పదిమంది పిల్లలు పోగై గోల చేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూవున్న సూరయ్య అకస్మాత్తుగా పరుగెత్తటం మొదలుపెట్టాడు. రంయిన పరుగెత్తి ఒక ఇంటి ముందు ఆగి, ఒక్క నిమిషం ఆ యింటిని చూచి, అక్కడ నుంచి కదిలి పక్కనేవున్న బావి గట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడివాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళు చేతుల్లోనే వున్నాయి. నేనూ నా స్నేహితుడు ఊపిరి బిగపట్టి చూస్తూ నుంచున్నాం. సూరయ్య వంగి బావిలోకి చూచిలేచి, ఇంటి వైపుకు చూశాడు. ఉండి ఉండి "బే" అని సైరన్‌లాగా విన్నవాళ్ళకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్ళ మూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్లూ వీళ్లూ పోగయ్యారు. గాని ఏమీ లాభం లేకపోయింది. నా స్నేహితుడికిచ్చిన రాళ్ళమూట తేలనివ్వకపోయింది. శవం బయటకు వచ్చింది. తర్వాత—మేం ఇంటికి వచ్చిన తర్వాత-నా స్నేహితుడు ఇలా చెప్పాడు "ఆ ఎదురుగావున్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి."